# ప్రకృతి విలాసము

శ్రీమతి చిల్కపాటి సీతాంబగారు

ప్రదేశము—కైలాసము

ప్రవేశము—శివుడు దాక్షాయణి.

శివుడు:—దాక్షాయణీ! దీర్ఘదర్శిత్వమనునది స్త్రీజాతికిఁ బూర్వానుసారముసుమా. ఎంతటి ఆత్మబంధువులైనను, మతవైషమ్యము లుంచుకొని తామే శ్రేష్ఠులమని ఇతర దైవములను ఇతరులను ద్వేషించువార లెన్నటికిని మాన్యులుగారు. అట్టివారిం దరియుటయు హానికరము.

దాక్షాయణి:—దేవా! కాలవైపరీత్యముచే వైషమ్యభావమూనిన మజ్జనకు నింతటితో త్రోసిపుచ్చందగునా? మా అయ్య మూర్ఖుడేయగును. ఐనను తొల్లి విరించిచే ప్రాజాపత్యపదవినంది స్రష్టయయ్యె. ఇపు డొకానొక నెపమున మిమ్ము ద్వేషించి మీ వైముఖ్యమునకుం గురియయ్యెనేని యధఃపతితుడగునుగదా. అట్టితరి విశుద్ధప్రకృతులగు సతీమతల్లు లీ విధికల్లోలములం గలుగనీక ప్రపంచమునకు ప్రశాంతి గలుగజేయవలయునని నా మనవి.

శివుడు:—దాక్షాయణీ! (తెరలో ప్రకృతి విలయమొందును. భస్మమగును.) ఉపశ్రుతి విలయమును సూచించుచున్నది. ఎవరక్కడ?

నందీశ్వరుడు:—(ప్రవేశించి) దేవా! దక్షానుచరులు మనకుయజ్ఞభాగమీయమని నిందించుచు బోవుచుండిరి. శివాభావమగు నా యజ్ఞము దగ్ధమగు గాక అని మేమును శపియించితిమి.

శివుడు:—ఆతడు దక్షుడేయైనను అసూయాపిశాచగ్రస్తుడగుటచే నన్నిట అదక్షుడేయగును. ఇంతలో శాపమేల. ఇపుడా దక్షాధ్వరముంజూడ మీయమ్మ పయనమగుచున్నది.

నంది:—(తత్తరముతో) అయ్యో! ఆయ్యో! అమ్మా!

దా:—అత్యాహితమేమి?

శి:—అపాయమని.

దా:—ప్రాణేశా! అట్లనకుడు. కన్నబిడ్డలయెడకన్నవారి మనస్సులు వెన్నవలె నుండును. అభ్యంతరములు సెప్పక సెలవిండు.

శి:—దాక్షాయణీ! పోదగని తావులకుం బోయిన రాదగని యాపదలు రాకమానవు.

మనస్సు కీడునే శంకించుచున్నది. భవితవ్య మెటులున్నదో? నందీ! మీ యమ్మను దక్ష పురంబున విడచిరమ్ము. దేవి! పయనిం పుము.

దా:—దేవా! చిత్తము. నే బోయెద.

న:—(స్వగతము. దేవి పోయివచ్చెద ననుటకుమారు పోయెదననుచున్నది. ఆశీర్వ చనములందును ప్రయాణములందును అశ్లీల ధ్వనులుండరాదు. కాగలది కాకమానదు) అమ్మా! ఇట్టిటు. (నిష్క్రమింతురు.)

*　　*　　*

రంగము—దక్షాధ్వరవాటిక

దక్షుడు, దాక్షాయణి, దేవతలు నుందురు.

దక్షుడు:—కుమారీ? పిలువని పేరంట మునకు వచ్చియు ఆ కొండపీటిజంగమ దేవర యేమో మహాదేవుడని స్తోత్రము జేసెదవు పామ్మావలకు.

దా:—తండ్రీ! ఆ కొండపీటిజంగమ దేవరను నిండుభక్తి నారాధించిన కుబేరా దులు నిత్యశ్రీయుతులై యణిమాద్యష్ట విభూతులంది చరితార్థులైరి. మూఢులై నిందించినవా రధఃపతితులైరి.

ద:—ఇల్లు వాకిలిలేక వల్లకాట గాపుర ముండి బిడియము విడచి బిచ్చమెత్తుకొనుచు కొండలలో దిరుగుచుండెడువాని నిండుభక్తి నారాధించి చరితార్థులగుదురట అట్టి బ్రహ్మఘ్నుని కన్నియనిచ్చి వేదురునై చెడిపోతిని.

దా:—దుర్జనుల యెడ తామసీ యగు నా రుద్రునియెడ నవినీతుడై న మూఢుడు తామసిగాక యుండునే. మహా దేవునికి నిండోలగంబున నవినయముంజూపిన యాచతుర్ముఖుని గతి నీవే స్మరించుచుంటివి గదా? అన్యోన్యాభేదస్వభావమున శుద్ధసత్వ స్వరూపుడై సత్యసంకల్పుడగు పుండరీ కాక్షుడు సకలలోకపూజ్యుండగుట దలం పుము. దేవతానింద నారకకారణంబగు.

ద:—జోగి పునుక నిడుకొని భిక్షాన్న మును గ్రసించు నావిరూపాక్షుని సాహ చర్యముచే నీకును మతిపోయినది. అబలవు ఒకమూలనుండక భక్తిమార్గము లుప దేశింపవచ్చితివా చాలు జాలు.

దా:—అబలనని నిరసింతువా? నేను బోధించునది ధర్మేతరమని నిందించు చుంటివా? సమస్త స్థావరజంగమ భూతా త్మకంబగు నీ యనంతప్రపంచంబునకు ఈ యబల మూలప్రకృతియని యెరుంగవా. అఖిల విద్యాధినేతయగు వాణి యెవ్వరు? సకల సంపదధిష్ఠాన దేవతయగు లక్ష్మి ఎవ్వరు? బుద్ధియు బలమును సంపదయు లేనిచో సృష్టిస్థితిలయముల కాధారమగున దెద్ది? నీ వెవ్వరు? ఎచ్చటనుంటివి? ఎట్టి యుత్సాహశక్తిచే జన్మముసేయ నెంచి ఈ పుణ్యసభాస్థలి నాసీనుడవై యుంటివి. అం తయు ప్రకృతి శక్తివలననే కదా. అట్టి ప్రకృతి శివాధీనమని యెరుంగుము. లేకున్న సర్వశూన్యము.

ద:—ఓసీ ప్రేలరీ! ఈసభ విడచి పోయెదవా మెడబట్టి గెంటవలయునా?

దా:—(మండిపడి) దురాత్మా! నీ కడుపున బుట్టి దాక్షాయణీ సంజ్ఞచే నాయభవుని ప్రోల చరించుట తగదు. నీమొగము జూడ రాదు. శివనిందామహాపాతకివి. ప్రపంచమునకు మూలప్రకృతియగు స్త్రీకి అవజ్ఞనొనర్చితివి. ఈ పాపఫల మిపుడే కట్టికుడుపును. శివాభావముగా నొనర్చిన నేక్రతువైనను సుఖాంతముగా నేరదు. ధ్వంసమగును. మరణమాపాదించును. మహాదేవునానతి జవదాటి నీ కడపద్రొక్కి నీ మొగము చూచిన పాపమున నపవిత్రమగు ఈ దేహ మిక నిలువ రాదు. భస్మము గావలయును. ఈ ప్రకృతి వికృతినొంది మరల నూతనశోభ నందుగాక. (ఆకసమువంక జూచి) దేవా! మహానుభావా! ప్రకృతి భస్మమగుచున్నది. (దాక్షాయణి భస్మమగును. సభ్యులు హాహాకారము లొనర్తురు.)

దేవతలు:—భయముతో ఆహా! అదేమి! ప్రళయకాల భైరవునివలె నేదియో యొక మహాభూతము విజృంభించి ఈ వంకకు బరువెత్తి వచ్చుచున్నది.

నారదుడు:— దాక్షాయణి భస్మమగుటకుం గనలిన రుద్ర కోపాగ్నిమూర్తిం దాల్చి దక్షాధ్వరధ్వంస మొనర్పవచ్చుచున్నది. (వీరభద్రుడు ప్రవేశించి రౌద్రముతో శివాభావమగు యజ్ఞము ధ్వంసము చేయును. వేల్పులను తన్నును. వేల్పులు పరుగువారుదురు.)

వీర:—ఓరీ సూర్యా! ఆదిశక్తిని పరాభవించుచుండ చూచి నవ్వితివటరా. (దంతము లూడదన్నును.)

సూర్యుడు:—రుద్రానుచరా! అపరాధిని. మన్నింపుము. (మరుగుపడును.)

వీర:—దక్షా! నీ వికలేవు. (తల నెగురగొట్టి) దిక్పాలులారా! యాగావసానమైనది. యాజినై దక్షుని శిరంబిదిగో పూర్ణాహుతి గావించుచున్నాడ. (దాని నగ్నియందు వేల్చును)

బ్రహ్మ:—(వడకుచు) నారాయణా రమ్ము. యజ్ఞ వరదుండవు గమ్ము. (విష్ణువు ప్రవేశించును బ్రహ్మాదులు నమస్కరించి) దేవా ఇది యిటులైనది.

విష్ణు:—ఇది శివనిందా పాపఫలము. అవశ్యమనుభావ్యము.

గీ॥ ఆతడు మహామహుండు లోకైకవంద్యు
డభవుడాద్యుండు శంకరుం డాదిదేవు
డట్టి శివనిందన మొనర్చి యాచరించు
క్రతువు సెడకున్నె విఘ్నము గాంచకుండ.

మరియు నీ దక్షు డవివేకియై,

గీ॥ జగములకు మూలమౌ పరాశక్తినీత
డాత్మవిజ్ఞానశూన్యుడై యవమతిగనె
నట్టిపాపంబునకు ఫలమందె నిపుడె
యెవరి కర్మంబు వారల నేచకున్నె.

బ్రహ్మ:—దేవా! అజ్ఞానదోషమో దుష్కాలవైపరీత్యమో ఈ దక్షుడు శివుని

ద్వేషించి ప్రకృతి నవమానించి మృత్యుం డయ్యె. కరుణించి వీనిని సజీవునిగా నొనర్చి యజ్ఞమును కాపాడుము. లోకముల రక్షింపుము.

విష్ణు:—సరియే. ఇపు డోకవిధముగా నీ ప్రళయ ముపసంహారింపబడుగాక. (దక్షుని మొండెముపై అజశీర్షమునుంచును)

దక్షుడు సజీవుడై లేచి నమస్కరించును.

విష్ణు:—దక్షా! నీయజ్ఞ మీవిధముగా సమాప్తినొందినది.

దక్షు:—ధిత్తము దేవా!

విష్ణు:—వీరభద్రా! నీ విక శాంతినొంది కైలాసమున కేగుము. ప్రకృతి శోభావంతమై మరల భవునిం జేరగలదు.

వీర:—చిత్తము. (నిష్క్రమించును)

బ్రహ్మ:—నారాయణా! మీ కరుణచే దక్షుడు సజీవుడయ్యెను. యాగ మెటులో సమాప్తి నొందినది. అయినను ప్రపంచ మేమియో భీభత్సరూపమున దోచుచు భయము గొల్పుచున్నది. ఈ విలయ ముపసంహరింపబడు మార్గము దెల్పి రక్షింపుము.

విష్ణు:—ప్రజాపతీ! నాకును అటులే దోచుచున్నది.

క॥ సకల జగంబున కాది
ప్రకృతియగుచు వెలయు సతి యపార క్రోధా
గ్నికి దన మే నాహుతిగా
వికృతిన్గనెగాన నిట్టివిలయము దోచెన్.

గాన నిపు డా ప్రకృతి మూర్తిమంతమై మరల హరుని సన్నిధిం జేరినగాని ప్రపంచము శోభావంతము గానేరదు.

బ్రహ్మ:—దేవా! ఐన నా పరాశక్తి ప్రసన్నత నొందుటెట్లు?

విష్ణు:—ఆ కార్యమునకు తక్కిన వేల్పులు గడంగవలయును. మున్ను మన మాశంభుని ప్రశాంతునిం జేయవలయును. రమ్ము. (విష్ణు బ్రహ్మలు నిష్క్రమింతురు)

కుబేరుడు:—దేవమునీ! దేవీప్రసాద మేవిధి బడయగలమో కరుణించి తెల్పుము.

నారదుడు:—వేల్పులారా! వివరించెద.

గీ॥ ఆశ్వయుజమందు వచ్చు శుద్ధాష్టమితిథి
కమరుదానికి సంజ్ఞ దుర్గాష్టమియన
నట్టిపుణ్యదినంబున నాదిశక్తి గౌరి
భక్తియుతంబుగ గొల్వవలయు.

పరాశక్తికి ప్రీతికరమగు అష్టమీ మాహాత్మ్యము ఇట్టిదని వర్ణింప నలవిగాకున్నది.

సీ॥ అష్టమీతిథియందు నాదిశక్తిని గొల్చి
యభవుండు లయశక్తినంది వెలసె
పర్వాష్టమిని భక్తి ప్రకృతి నారాధించి
సరసిజాసనుడు దా స్రష్టయయ్యె
శుద్ధాష్టమిని దేవి శుభయుక్తి పూజించి
అఖిలశక్తులనందె యాదివిష్ణు
దుర్గాష్టమిని భక్తితో దేవినర్చించి
పాకశాసను డింద్రపదవి నొందె.

గీ॥ పుట్టుకయు పెంపువిలయంబు బొందుదేని
వివిధపరిణామశక్తి నా విశ్వజనని
భక్తి నారాధనముసల్ప బడయరాని
దెద్దియునులేదు జగముల నెంచిచూడ.

ఆశ్వయుజ శుద్ధాష్టమి ఈ దేవ్యుపాసన జేసిన నుత్తమోత్తమము. శరన్నవరాత్ర ప్రథమ దివసముననే దేవీకళశస్థాపన మొనర్చి తత్సహితముగా లక్ష్మీసరస్వతులం బూజింప వలయు. తన్ముఖోల్లాసమునకై ఫలకుసుమ తాంబూలాదులచే సువాసినీ సమార్చనం బుతో దశమినాడు వ్రతోద్యాపన మొనర్పం దగు. ఇహపరలోకసాధకంబగు నీ దేవ్యుపాసన సమస్త జగంబులకు ననుష్ఠేయము గాన నా పరాశక్తి నుపాసించి ధన్యతనొందుదము. దేవీశరన్నవరాత్రములంను దరిసినవి.

కుబేరాదులు:— చిత్తము. (నిష్క్రమింతురు)

ప్రదేశము—హిమాలయము

నిష్ఠాగరిష్ఠులగు దేవతలు ముకుళిత కరులై,

శా॥ హే దాక్షాయణి సర్వలోకజననీ
హే శాంభవీ శాంకరీ
హే దుర్గేజితవైరి వర్గనిచయే
హే కృత్తివాసప్రియే
హే దండాంకుశ ఖడ్గసాయుధకరే
హే ముక్తిసంపత్ప్రదే
హే దేవీ శుభదేమతంగవరకన్యే
పాహి నస్సర్వదా.

ఉ॥ అమ్మవు సర్వలోకముల
నాత్మబలంబున సృష్టిజేయునా
బొమ్మను జీవులన్గరుణ
బ్రోచెడుసామిని కంటిమంటలం
జిమ్మి సమస్తమున్ లయము
జేసెడివానిని నీయనంతయో
గమ్మునగాదె కర్తలుగ
గాంచితి సర్వజగద్విధాయినీ.

శా॥ పంకేజంబులగేరు నేత్రములతో
పర్వేందు వక్త్రంబుతో
సంకున్ శోభనద ల్సుకంధరముతో
సౌహార్ద్రచిత్తంబుతో
పంకేజాసను డాదివేల్పులునినున్
భావించి సేవింప నీ
వంకన్ వే దయసేయుమమ్మ జగము
ల్పాలింప దాక్షాయణీ!

గీ॥ జపతపాదులకేని నసాధ్యవును న
గమ్యవును గానినిన్ను దుర్గయనునట్టి
యక్షరంబుల పేర్కొని హరిహరాదు
లాత్మలనునిల్పిపూజింతు రహరహములు.

గీ॥ అక్షర మచిన్త్య మవికల్ప మద్భుతంబు
నీయనంత మహాయోగ నిర్మలస్వ
రూపదర్శనము భవతాపహరము
కరము కరుణించి జగముల గావుదేవి.

క॥ విశ్వజనని విశ్వేశ్వరి
విశ్వంభర విశ్వరూప విశ్వాత్మకయీ
విశ్వప్రళయము వాపుచు [గరుణన్.
శాశ్వతశివమొసగిబ్రోవు జగముల

అదిగో దేవి ప్రసన్నయైనది. జయ దేవీ! జయ. (నమస్కరింతురు)

దేవి:—వేల్పులారా! మీ తపశ్చర్యలకు మెచ్చితి. ప్రపంచంబు ప్రశాంతము నొందినది. నారాయణ ప్రార్థితుండై మహాదేవుండును శాంతుండయ్యె. శరన్నవరాత్రి వ్రతనియతులై అష్టమీతిథియందు మదీయంబగు దుర్గామంత్రం బుపాసించి ధన్యులగు మీ ప్రార్థనంబున నేనును సంతుష్టనైతి. ఇక పార్వతీ సంజ్ఞచే భవునిం జేరెద. జగంబులన్నియు నిరతసౌఖ్య శ్రీవిభాసితములై వర్ధిల్లుగాక. మేలయ్యెడు. ఇక మీ రరుగుడు.

దేవతలు:—ధన్యోస్మి! ధన్యోస్మి! అనుగ్రహీతులము. (నమస్కరించి అందరు నిష్క్రమింతురు.)

---

## పుట్టినింటి తీపి

శ్రీమతి స్వారాజ్యలక్ష్మిగారు

౧

ముజ్జగంబుల నేలెడు మోహనుండు  
తనవిభుండయ్యు నిందిర తండ్రిగృహము  
వదలజాలక కాంబోలు భర్తఁగూడ  
పుట్టినింటనె వసియింపఁ బట్టుబట్టె.

౨

అతడు సర్వజ్ఞుఁ డాతనిహితుడు ధనదు  
డతని కేల్వట్టిగూడ పర్వతకుమారి  
పుట్టినిలు వీడనోపక పట్టుపట్టి  
ఇల్లరిక ముంచుకొనె హృదయేశుగూడ.

౩

కడుప్రియమ్మున లాలించు కన్నవారి  
వీడి యొరులింటి కే బాల వెడలగలదు?  
ఈశుపోలిక నర్ధాంగ మీయలేని  
విష్ణు పగిదిని హృదయ మర్పింపలేని.